క్లుప్తంగా

ముగ్గురిపై కేసు

కాటారం: బొగ్గు లారీల డ్రైవర్లను బెదిరించి దౌర్జన్యంగా డబ్బులు వసూలుకు ప్రయత్నించిన సంఘటనలో ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన బోడ లక్ష్మిరాజు, పప్పుల దినాకర్, మారుపాక అజయ్‌లు మద్యం మత్తులో గంగారం క్రాస్ వద్ద బొగ్గు లారీని ఆపి డ్రైవర్‌ను బెదిరించగా అతను పారిపోయి దాక్కొని కొద్ది సేపటి తర్వాత మళ్లీ లారీ వద్దకు వచ్చాడు. సదరు ముగ్గురు వ్యక్తులు లారీ డోర్‌ను తన్ని డ్రైవర్ రమేశ్‌ను డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. దీంతో డ్రైవర్ రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కూలిన గైడ్‌వాల్ పరిశీలన



కూలిన గైడ్‌వాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మంగపేట: మండల కేంద్రంలోని పాతసినిమా హాల్ వీధిలోని వడ్డెరకాలనీ వద్ద గౌరారంవాగు ఒడ్డు వెంట రెండు సంవత్సరాల క్రితం కూలిన గైడ్‌వాల్ ప్రాంతాన్ని తహసీల్దార్ రవీందర్, మండల స్పెషలాఫీసర్ సిద్దార్థరెడ్డి శనివారం పరిశీలించారు. గౌరారంవాగు భారీగా ప్రవహిస్తే గౌడ్‌వాల్ కూలిన ప్రదేశం నుంచి వరద నీరు పక్కనే ఉన్న వడ్డెర కాలనీలోకి నీరు వచ్చే ప్రమాదం ఉందని కాలనీవాసులు అధికారులకు తెలిపారు. గత రెండేళ్ల క్రితం భారీ వరదల కారణంగా కాలనీ మొత్తం నీట మునిగిందని వాపోయారు. మళ్లీ అలాంటి పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన అధికారులు గైడ్‌వాల్ మరమ్మతులు చేపట్టేందుకు ఇరిగేషన్ అధికారులు అంచనా నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించారని ప్రసుత్తం వరద నీరు రాకుండా ఉండేందుకు ఇసుక బస్తాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి సురేష్, నాయకులు మల్లయ్య, హుస్సేన్, కాలనీ వాసులు ఉన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి

● డీఈ నాగేశ్వర్‌రావు

మంగపేట: మండలంలోని రైతులు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ పులఎం నాగేశ్వర్‌రావు అన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మల్లూరులో పొలం బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాను అందిస్తున్నామని, రైతుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పొలంబాట కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుందన్నారు. కెపాసిటర్లను అమర్చుకోవడం వలన లోఓల్టేజీ సమస్య ఉండటకుండా ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోని రైతులందరికీ సక్రమంగా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమలలో లైన్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, ఏఎల్ఎం సాంబశివ, కాంట్రాక్టర్ ఆక రవి, రైతులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు

● గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్

ములుగు రూరల్: పార్టీ కోసం కట్టుబడి పనిచేసిన వారికి పదవులు దక్కుతాయని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికై న రేగ కల్యాణికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్టీ రిజర్వేషన్ కావడంతో ఏడు సంవత్సరాలుగా మార్కెట్ కమిటీ కార్యవర్గం లేకుండా కొనసాగిందని అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క చొరవతో ములుగు మార్కెట్ కమిటీ నూతన కమిటీ నియమకం జరిగిందని అన్నారు. చట్ట ప్రకారం ఎస్టీ సామాజిక వర్గానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, నల్లెల్ల భరత్‌కుమార్, జయాకర్, తిరుపతి, తిరుపతిరెడ్డి, అభినయ్, రవిందర్‌రెడ్డి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

ఏటూరునాగారం: ఓటర్ల సర్వేను బీఎల్‌ఓలు సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ జగదీశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐటీడీఏ సమావేశపు గదిలో బూత్ లెవల్ ఆఫీసర్లకు అవగాహన సదస్సును ఎన్నికల సంఘం మండల అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ అధికారులు నితీష్, నాగరాజు మాట్లాడుతూ.. ఫామ్ 6, ఫామ్ 8 ఎలా నింపాలని, ఓటర్లకు నమోదు ఎలా చేసుకోవాలని వివరించాలన్నారు. ఓటర్ల జాబితాను సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రాహుల్, ఆర్ఐ కిరణ్‌కుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సమైక్యతకు ప్రతీక మొహర్రం

● పండుగ ముస్లింలది..
● ఆచారమంతులుగా హిందువులు
● మత సామరస్యతకు నిదర్శనం



కొత్తపల్లిగోరిలో పీరీలను ఊరేగిస్తున్న ఆచారమంతులు

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల ప్రజలు మతాలు వేరైతేనేమి భగవంతుడు ఒక్కడే అన్న రీతిలో మొహరం వేడుకలను నిర్వహించుకుంటారు. పండగా ముస్లింలదైనా.. మండలంలో ఆచారమంతులుగా హిందువులే వ్యవహరిస్తారు. అగ్ని గుండం చుట్టూ అసైదులా హారతి.. కాళ్ల గజ్జల గమ్మతి అంటూ కాళ్లు కదుపుతారు. కుల, మత భేదాలు లేవంటూ సమైక్యతను ప్రదర్శిస్తుంటారు. మహమ్మదీయుల పర్వదినాలలో మొహరం ముఖ్యమైంది. హసన్, హుస్సేన్ అనే ముస్లిం వీరుల స్మారార్థం శోకతప్త హృదయాలతో నిర్వహించుకునే కార్యక్రమమే పీర్ల పండగ మొహర్రం. ధర్మయుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరుల త్యాగానికి ప్రతీకగా హస్తాకృతి కలిగిన రూపాలను తయారు చేసి వాటిని అలంకరించి, ఊరేగించి పూజిస్తారు. మొహర్రంలోని పది రోజులు విషాద దినాలే. కాగా మొహర్రం మాసం ఆరంభం నుంచి ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతోంది. అమరుల వీరమరణానికి నిదర్శనంగా చావిడిలో పీరీలను కూర్చోబెట్టి పది రోజుల పాటు ప్రార్థనలు చేస్తారు. కుల, మతాలకతీతంగా అందరూ పాల్గొని పీరీల వద్ద ప్రత్యేక పూజలు, చదివింపులు జరపడం విశేషం. మత సామరస్యతకు ఇది గొప్ప నిదర్శనం

నేడు మొహర్రం.. బీబీకా ఆలం

నేడు(ఆదివారం) మొహర్రం సందర్భంగా తెల్లవారుజాము నుంచే పీరీలను గ్రామంలోని వీధుల గుండా ఊరేగిస్తారు. ఊరేగింపు సమయంలో పీరీలను ప్రతి ఇంటి ముందు ఆపుతారు. ఆ సమయంలో ఇంటివారు బిందెలతో నీళ్ల తెచ్చి పీరీలను ఎత్తుకున్న వారి పాదాలను శుభ్రం చేసి పాదా నమస్కారాలు చేసుకుంటారు. కులమతాల కతీతంగా భక్తి ప్రవత్తులను చాటుకుంటారు. భక్తులు పీరీలకు రంగుల దట్టీలు, కుడుకలు ఇచ్చి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం పీరీలను మఖానంలో ఉంచి అగ్ని గుండంలో పాలు పొంగిస్తారు. పాలు ఎటువైపు పొంగితే అటు వైపు కాలం అవుతుందని భక్తులు నమ్ముతారు. సాయంత్రం పీరీలను చావిడి నుంచి తీసుకుని గ్రామ శివారులోని పొలిమేర వరకు తీసుకెళ్లి వాటిని శుభ్రం చేసి ఓ మూట కడతారు. 'అల్‌బిదాయో ఏకుసేని' అంటూ బీబీకా ఆలం పాటను ఆలపిస్తూ పీరీలతో పాటు వాటికి అమర్చిన కర్రలు, దట్టీలను మళ్లీ చావిడికి తీసుకువస్తారు. అప్పుడు మొహరం పూర్తవుతుంది. మొహరం అనంతరం మూడు రోజులకు జియారత్ నిర్వహిస్తారు.



చావిడి ముందు అగ్నిగుండం

దాతలు దయ చూపండి..

● విద్యుత్ షాక్‌తో అన్‌మ్యాన్ కార్మికుడికి తీవ్ర గాయాలు
● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దాతల కోసం వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిల్

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన జన్నే అనిల్ మొట్లపల్లి సబ్ స్టేషన్‌లో అన్‌మ్యాన్ కార్మికుడిగా కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం విద్యుత్ స్తంభం నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ తరలించగా అక్కడి నుంచి ఎంజీఎంకు పంపించారు. మళ్లీ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అనిల్‌కు వెన్నుముక దెబ్బతిని లేవలేని స్థితిలో ఉన్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని అనిల్ కుటుంబం వైద్య ఖర్చుల కోసం తెలిసిన బంధువుల వద్ద అప్పులు తెచ్చి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటి వరకూ రూ.రెండు లక్షల మూప్పైవేలు ఖర్చు కాగా ఇంకా రూ.20లక్షల నుంచి రూ.25లక్షలు అవసరమని డాక్టర్లు తెలుపుతున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. దీంతో ఏమి చేయలేక దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. గాయపడిన అనిల్‌కి భార్య, తల్లి తండ్రి ఉన్నారు. తండ్రి అనారోగ్యంతో మంచంలో పడి కొన్ని సంవత్సరాలుగా లేవలేని స్థితిలో ఉండగా అనిల్ తండ్రికి సేవలు అందించేవాడు. తల్లి వృద్ధురాలు కాగా భార్య కూలి పనికి వెళ్తుంది. ఇల్లు గడవడమే కష్టంగా ఉండడంతో ఆస్పత్రి ఖర్చులకు డబ్బులు లేని దినస్థితి ఉన్నారు.ప్రభుత్వం నుంచి కూడా సాయం అందించాలని కోరుకుంటున్నారు.

దాతలు దయచూపి ఫోన్ పే నంబర్ 87905 19548 ద్వారా సాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

'బీఆర్ఎస్‌లో కార్యకర్తలకు ప్రాధాన్యం లేదు'

కాళేశ్వరం: మంథని నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదని పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు మేరుగు లక్ష్మణ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సంఘాలతోనే అన్ని వర్గాల సమస్యల కోసం పోరాటం చేస్తానన్నారు.

ప్రజల పక్షాన నిలబడి పోరాడుతాం..

● బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి



మాట్లాడుతున్న జవ్వాజి తిరుపతి

పలిమెల: తప్పుడు కేసులకు బీఆర్ఎస్ నాయకులు భయపడేది లేదని ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మచ్చలేని రాజకీయ జీవితంలో తనపై కాంగ్రెస్ నాయకులు కుట్రలో భాగంగా తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయించి జైలు పాలు చేయాలని చూశారన్నారు. తప్పు చేయకున్నా తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపాలని చూసినా ప్రజాస్వామ్యబద్ధంగా తీర్పు వెలువరించిన నిజం వైపు నిలబడిన న్యాయస్థానానికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దమ్ము ధైర్యం ఉంటే దక్కన్ సిమెంట్ కంపెనీ పై కేసు నమోదు చేయించి పలిమెల రైతుల పేర్ల మీద పట్టాలు చేపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దింటి మల్లయ్య, మండల ప్రచార కమిటీ చైర్మన్ మట్టి సత్యం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాగె సడవలి, మాజీ సర్పంచ్ మడే సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రేగొండ: లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ/చిట్యాల: పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని, చిట్యాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో, రేగొండలోని రైతువేదికలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు పున్నం రవి, సూదన బోయిన ఓంప్రకాష్, అప్పం కిషన్, గండి తిరుపతి, వీరబ్రహ్మం, బొజ్జం రవి, విజేందర్, ఏనుగు రవిందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగాల్లో యువతకు ఉపాధి

సహకార రంగాల్లో యువతకు శిక్షణతో పాటు, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 వేడుకల్లో భాగంగా రేగొండ పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో, చిట్యాలలోని డీసీసీ బ్యాంకు ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘాలు రుణ కల్పన, ఎరువుల సరఫరా, మార్కెటింగ్‌తో పాటు పలు సేవలు రైతులకు అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి మాలోతు వాల్య నాయక్, పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, చిట్యాల తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా, ఎంపీడీఓ జయశ్రీ, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, వైస్ చైర్మన్ రఫీ, మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, నాయకులు రాయకోంరు, లక్ష్మన్, శ్రీనివాస్, కిష్టయ్య, రవీందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రేగొండలో పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ

రేగొండ: మండల కేంద్రానికి చెందిన ఓరంగంటి సాయిలు ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు లెంకల రాజిరెడ్డి, సూర నరసింహారావు, బింగి భిక్షపతి, బుర్గుల ప్రభాకర్, మాడగాని సురేష్, విజయ్ ఉన్నారు.

టేకుమట్ల: మండలంలోని ఏంపెడు మాజీ సర్పంచ్ కొలిపాక రాజయ్య తండ్రి దాసు, మాజీ వైస్ ఎంపీపీ సట్ల కొమురయ్య తల్లి అమృతమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్సీ మధుసూదనాచారి పరామర్శించారు. అనంతరం రాఘవపూర్ గ్రామానికి చెందిన అక్షిత్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి రాగా ఆయనను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు తోడేటి రవి, చేరాలు, గట్టు రవి, శ్రీనివాస్, సమ్మయ్య, రజినీకాంత్, ఉపేందర్ ,స్వామి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ..

మాజీ వైస్ ఎంపీపీ సట్ల కొమురయ్య తల్లి అమృతమ్మ ఇటీవల మృతి చెందగా శనివారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా నాయకుడు దొంతుల శ్రీనివాస్, చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపల్లి వీరేశం, మండల ప్రధాన కార్యదర్శి పున్నమి సాంబయ్య, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● తహసీల్దార్ గిరిబాబు



వంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గిరిబాబు

వెంకటాపురం(ఎం): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ గిరిబాబు అన్నారు. శనివారం మండలంలోని రామంజాపూర్ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను, పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురు కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెనూ ప్రకారం భోజనం, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సూచించారు. జ్వరాల బారిన పడకుండా ముందస్తుగా వైద్యశిబిరాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విజేందర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కన్నాయిగూడెం: ఐలాపూర్‌లోని ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ సర్వర్ శనివారం తనిఖీ చేశారు. పాఠశాల మౌలిక వసతులను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ పాటించాలని తెలిపారు

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్



విద్యార్థులతో మాట్లాడుతున్న స్మరణ్

కాటారం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతి బా పూలే బీసీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ అధికారులను డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం ఎంజేబీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలకు సరైన భవనం లేకపోవడంతో పాటు అద్దె భవనంలో అసౌకర్యాలు నెలకొన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి గ్రౌండ్ కూడా లేదని పాఠశాలలోకి వెళ్లే దారి పూర్తిగా బురదమయమై విద్యార్థులు, పాఠశాలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. డివిజన్ అధ్యక్షుడు శ్రావణ్, తిరుపతి ఉన్నారు.

అభివృద్ధిని విస్మరిస్తున్న పాలకులు

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సతీశ్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాటారం: మండల అభివృద్ధిని, ప్రజా సమస్యలను పాలకులు పూర్తిగా విస్మరిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్యాతరాజు సతీశ్ ఆరోపించారు. సీపీఐ 5వ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను మండలంలోని కొత్తపల్లిలో నాయకులతో కలిసి సతీశ్ శనివారం ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా మహాసభలను ఈ నెల 13, 14న రేగొండలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సోత్కు ప్రవీణ్, చిట్యాల ప్రవీణ్, వేముల శ్రీకాంత్, జోసెఫ్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పలిమెల: రేగొండలోని ఎస్ఎల్ఎస్ గార్డెన్‌లో ఈనెల 13, 14న నిర్వహించే సీపీఐ పార్టీ 5వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సోత్కు ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ నాయకులతో కలిసి మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభలకు ప్రజలు, మేధావులు, కార్మికులు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజ్ సతీష్, మండల నాయకులు మట్టి సర్వేష్, మట్టి కృష్ణ, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, శ్రీనాథ్, అంజిబాబు, మారవేణి వెంకట్, పోడెం సోమయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



తిర్మలాపూర్‌లో ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు



కైలాపూర్‌లో..


చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి కంచర్ల పోషాలు ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మృతుడి కుమారుడు కంచర్ల రాంబాబుతో కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు రూ.23వేలు నగదును అందజేశారు. మిత్రులు మురహరి భానుచందర్, చింత మహేందర్, ఉయ్యాల రమేష్, కల్వచర్ల రాము, చిలుముల రాజేష్, ఎండి. సాజిత్, గుండ తిరుపతి, గోపగాని ప్రవీణ్, కమ్మగాని బాలకృష్ణ, రాయిని శ్రీకాంత్, కంచర్ల నాగరాజు, కోడెల నరేష్ ఉన్నారు.

చిట్యాల: మండలంలోని కైలాపూర్ గ్రామానికి చెందిన సకినాల కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మృతుడి సోదరుడు రాకేశ్ మిత్రులంతా కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 40వేలు ఆర్థిక సాయం అందజేశారు. మిత్రులు చింతల మహేందర్, రాపెల్లి రాజు, మురళి, శివ , శ్రీరాం, టేకు రవి, చంద్రశేఖర్, రాజేందర్, తదితరులు ఉన్నారు.

ఏపీకే లింకుపై స్పందించొద్దు

కాళేశ్వరం: వాట్సప్ గ్రూపుల్లో సైబర్ నేరగాళ్లు వివిధ రకాల లింక్‌లను పంపిస్తున్నారని, ఎస్‌బీఐ, ఏపీకే అనే లింక్‌లను పోస్ట్ చేస్తున్నారని ఆ లింకులపై ఎవరు స్పందించొద్దని మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ లింకులు ఓపెన్ చేసిన వెంటనే మీ పర్సనల్ డాటా సైబర్ నేరగాళ్లకు వెళ్లి చాలా రకాల ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. తెలియక ఎవరైనా అలాంటి లింక్‌లు ఓపెన్ చేసి మీ అకౌంట్ హాక్ అయితే వెంటనే 1930 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

అశోక్‌పై చర్య తీసుకోవాలి



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మహేశ్

ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కోగిల మహేశ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎస్పీ శబరీశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. అశోక్ కొంత కాలంగా సభలు, సమావేశాలలో, సోషల్ మిడియా గ్రూప్‌ల్లో పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టె విధంగా పోస్టులు పెడుతున్నారని ఆధారాలతో ఫిర్యాదు చేశామని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉన్నాయని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు. నాయకులు బొమ్మినేని సురేష్‌రెడ్డి, దేవేందర్ తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించాలి

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం వీధిలోని రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతూ శివాలయం కాలనీ ప్రజలు తహసీల్దార్ వేణుగోపాల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో పాటు మురుగు నిల్వ ఉంటుందని అన్నారు. ఇళ్ల మధ్యలో నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుందని తెలిపారు. గ్రామస్తులు రమేష్, సతీష ప్రసాద్ , నర్సింహారావు, రమణ, తదితరులు ఉన్నారు.